రత్నగిరి ఇన్‌ఛార్జ్ ఇఒగా త్రినాథరావు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం దేవస్థానం ఇన్‌ఛార్జ్ ఇఒగా వేండ్ర త్రినాథరావు బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఆయన కొండపైకి విచ్చేసి స్వామి దర్శించుకున్నారు. ఇప్పటి వరకూ ఇఒగా విధులు నిర్వర్తించిన కె.రామచంద్రమోహన్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు ఈ సందర్భంగా ఇఒ త్రినాథరావు మాట్లాడుతూ ఇఒగా గతంలో పనిచేసిన అనుభవం దృష్ట్యా పాలనా, అభివృద్ధి, భక్తులకు వైదికపరంగా నిర్వహించవలసిన కార్యక్రమాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలోనూ రాజీ పడేది లేదని తెలిపారు.

బాధ్యతలు తీసుకుంటున్న త్రినాథరావు

రైతుల గుండెల్లో వణుకు

- తుపాను ప్రకటనతో ఆందోళన
- కళ్లాల్లోనే 70 శాతం ధాన్యం

వాతావరణ శాఖ తుపాను ప్రకటనతో రైతుల గుండెల్లో వణుకు మొదలైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడి తుపానుగా మారింది. దీన్ని ప్రభావం వల్ల ఇప్పటికే జిల్లాలో వాతావరణం మారిపోయింది. ఇంకా పంట కళ్లాల్లోనే ఉండటంతో అన్నదాతల్లో కలవరం మొదలైంది. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

ప్రజాశక్తి - రాజోలు, ఉప్పలగుప్తం, రాజమహేంద్రవరం రూరల్

బంగాళాఖాతంలో ఈ నెల 24న అల్పపీడనం ఏర్పడింది. ఇది క్రమంగా బలపడి తుపానుగా మారింది. దీని ప్రభావంతో బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంది. తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. బుధవారం అర్ధరాత్రి నుంచి తుపాను ప్రభావం ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 5 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేశారు. 12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం కోతలు జరుగుతున్నాయి. చాలా వరకూ పంట కళ్లాలోనే ఉంది. సుమారు 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా రైతుల వద్దే ఉంది. వీటిని పొలాల్లో, రోడ్ల చెంతనే ఉంచారు.

పంటను కాపాడుకునేందుకు బరకాలను కప్పుతున్న రైతులు

హడావుడిగా వరి కోతలు

వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ఊపందుకున్నాయి. వరికోత మిషన్లతో రైతులు హడావుడిగా కోతలను నిర్వహిస్తున్నారు. దీంతో వరికోత మిషన్లకు డిమాండ్ పెరిగింది. ప్రతీ గ్రామంలో పదుల సంఖ్యలో కోత యంత్రాలు పని చేస్తున్నాయి. ఒక యంత్రం రోజుకు 10 నుంచి 12 ఎకరాల్లో వరి కోత కోస్తోంది. ప్రస్తుతం వరికోతలు ఆపాలని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కోతలు ప్రారంభిస్తే వర్షాలకు తడిపి ధాన్యం పాడయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ బుధవారం సాయంత్రం వరకూ కోతలను కోసి ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతన్నలు నిమగ్నమయ్యారు. చాలా చోట్ల రైతులు కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు.

కోతలు వాయిదా వేసుకోవాలి

తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలి. వరి కోతలు వాయిదా వేసిన రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కళ్ళాల్లో ఉన్న ధాన్యంను సురక్షిత ప్రాంతాల్లో భద్రపర్చుకోవాలి. తప్పనిసరిగా కళ్ళాల్లో ఉన్న ధాన్యంను బరకాలతో ఎత్తేయిన ప్రాంతాల్లో ఉంచి సంరక్షించుకోవాలన్నారు. ప్రతి రైతు రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తమ ధాన్యాన్ని అమ్ముకోవటం ద్వారా మద్దతు ధర లభిస్తుందన్నారు.

-విజయకుమార్, వ్యవసాయ శాఖ జెడి , కాకినాడ.

నేలవాలితే నష్టమే...

వరి కోత దశలో వర్షాలొస్తే నష్ట తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే కొన్నిచోట్ల నేలవాలిన పంటపై చినుకులు పడితే ధాన్యం మొలకలొచ్చే అవకాశం ఉంది. తుపాను గాలి వల్ల వర్షం పడి ఆగిపోతే పెద్దగా నష్టం ఉండదు. గాలి వేగం ఎక్కువగా ఉంటే పంట నేలవాలిపోతుంది. దీనివల్ల మొలకలొస్తాయి. యంత్రంతో కోత కోయడానికి ఎక్కువ సమయం పడుతుంది.

సూచనలు పాటిస్తే..

కోతకు వచ్చిన పంటను వెంటనే నూర్పిడి చేయాలి.
కోతకు ఇంకా సమయం ఉంటే పొలంలో బాటలు చేసుకుని నీరు బయటకు వెళ్లేలా చూడాలి.
బాటలు చేయడం వల్ల గాలికి పంట చిందరవందరగా పడిపోకుండా ఉంటుంది.
వర్షపు నీరు పొలంలో నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

సామర్లకోటలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తి

ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి

సామర్లకోటలో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తి ప్రచారం

ప్రజాశక్తి - సామర్లకోట, కాకినాడ, యు.కొత్తపల్లి

ప్రభుత్వ విద్యను మరింతగా బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తి హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, అయోధ్య రాంపురం బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్స్‌ను ఆయన సందర్శించారు. ఆయా స్కూల్స్‌కు చెందిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను కలిసి ఓటును అభ్యర్థించారు. డిసెంబర్ 5న జరిగే ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి అభ్యర్థిగా పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్నానని, మీ యొక్క మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు నరవ సురేష్, డివైఎఫ్ఐ నాయ కులు కె.తులసిదాస్, డివి.లక్ష్మణ్, ప్రజాసంఘాల నాయకులు దారబాని కృష్ణ బి.శ్రీను, డి.సింహాచలం పాల్గొన్నారు.

కాకినాడలో మాజీ ఎంఎల్‌సి ప్రచారం

ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి మద్దతుగా కాకినాడ నగరంలోని పిఆర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. డిసెంబర్ 5న జరిగే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ బలపర్చిన గోపిమూర్తికి వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకులు కెఎంఆర్.ప్రసాద్, యుఎస్ఎన్.రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయ కులు ఎం.గంగసూరిబాబు, డి.ఆదర్శ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

యు.కొత్తపల్లిలో సిఐటియు ప్రచారం

ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి మద్దతుగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు యు.కొత్తపల్లి మండలంలో ప్రచారాన్ని నిర్వహించారు. మండలంలో పలు పాఠశాలలను సందర్శించిన ఆయన ఉపాధ్యా యులను కలుసుకుని గోపిమూర్తికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గుర్రాల అప్పారెడ్డి, కె.నాగేశ్వరరావు, సిహెచ్. సాంబశివరావు, జి.శ్రీనుపాల్గొన్నారు.

కాకినాడలో ప్రచారం చేస్తున్న మాజీ ఎంఎల్‌సి

యు.కొత్తపల్లిలో మాట్లాడుతున్న ఎవి నాగేశ్వరరావు

ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

క్లాప్ డ్రైవర్లకు కార్మిక సంఘాల మద్దతు

ప్రజాశక్తి - కాకినాడ

మూడు నెలల బకాయి వేతనాల కోసం ఉద్యమం చేపట్టిన క్లాప్ డ్రైవర్లకు కేంద్ర కార్మిక సంఘాలు మద్దతు తెలిపారు. బుధవారం నాటికి క్లాప్ వాహన డ్రైవర్లు చేపట్టిన ఆందోళన 34 రోజులుకి చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన శిబిరాన్ని ఎఐటియుసి, టిఎన్‌టియు పిఎస్ నారాయణ, గదుల సాయిబాబా పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాప్ వాహన డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కేంద్ర కార్మిక సంఘాలు ఉద్యమానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. 34 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే అధికారులు నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరించడం సరి కాదన్నారు. అనంతరం మున్సిపల్ అధికారులను కలిసి తక్షణమే జీతాలు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒకటి రెండు రోజుల్లో జీతాలు పడతాయని అధికారులు చెప్పారని, దానిని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకట రమణ, క్లాప్ వాహన డ్రైవర్ యూనియన్ నాయకులు సంతోష్, ఇస్మాయిల్, దుర్గాప్రసాద్, భైరవ స్వామి, రాజు, శివ శ్రీను, శివ, వెంకటేష్, దుర్గబాబు పాల్గొన్నారు.

భారతదేశాన్ని కాపాడేది రాజ్యాంగమే

ప్రజాశక్తి - కాకినాడ

భారతదేశంలో దళితులు, అట్టడుగు వర్గాల ప్రజలు, ఆదివాసీలు, మహిళలు, రైతులు, కార్మికులు మొదలగు ప్రజలందరికీ అండగా ఉండేది భారత రాజ్యాంగమేనని పలువురు వక్తలు అన్నారు. బుధవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో స్థానిక టీచర్స్ హోంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం ఆహ్వానం పలుకగా, జిల్లా అధ్యక్షులు బి.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ముందుగా సంఘం ఉపాధ్యక్షులు కెఎస్.శ్రీనివాస్ రౌండ్ టేబుల్ సమావేశం యొక్క ఉద్దేశాన్ని వివరించారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని, ప్రచారం కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ దినోత్సవం జరుపుతూ ఆచరణలో రాజ్యాంగాన్ని నీరుగారిస్తుందని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత భారత పౌరులందరిపై ఉందని, అందుకోసం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో నవంబర్ 26 నుంచి డిసెంబర్ 6 వరకూ భారత రాజ్యాంగం యొక్క విశిష్టతను జిల్లాలో ప్రచారం చేసి డిసెంబర్ 6 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ముగింపు సభను నిర్వహిస్తుందన్నారు. ముగింపు సభలో దళితులు, ప్రజాస్వామిక వాదులు పాల్గొనాలని కోరారు. దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, సామాజిక సాధన సమితి ప్రెసిడెంట్ డాక్టర్ భానుమతి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు, ఆర్‌పిఐ రాష్ట్ర నాయకులు పిట్టా వరప్రసాద్, ఎస్‌సి, ఎస్‌టి పోరం నాయకులు భయ్యా కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వర రావు, రిటైర్డ్ అగ్రికల్చరల్ జెడి పెట్ల సూర్యనారాయణ రాజు, రైతు కూలీ సంఘం నాయకులు వల్లూరి రాజబాబు, కెవిపిఎస్ తాళ్లరేవు మండల కన్వీనర్ తిప్పర్తి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. బిజెపి ప్రభుత్వ పదేళ్ల కాలంలో దేశంలో దళితులు, మైనార్టీలు, మహిళ లపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని, మతోన్మాద ప్రమాదం పెరిగిందన్నారు. ప్రయివేటీకరణ విధానా లతో రిజర్వేషన్లకు అర్థం లేకుండా పోయిందని, రాజ్యాంగం అమల్లో ఉన్నప్పుడే ఇలా జరిగితే రాజ్యాంగం లేకపోతే దళితుల పరిస్థితులు అర్థం చేసుకోవాలని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, గ్రామ గ్రామాన రాజ్యాంగం యొక్క విశిష్టతను ప్రచారం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు కూలీ సంఘం నాయకులు కె.అంజిబాబు, కెవిపిఎస్ నాయకులు పెదరిక్, ఏలేటి నానిబాబు, కటారి పద్మనాభం, రవికుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అయితాబత్తుల రామేశ్వరరావు

జీడిపిక్కల ఫ్యాక్టరీ తెరిపించాలని మనవహారం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గత నెల 16 వ తేదీన అర్ధాంతరంగా మూసివేసిన చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక బాలాజీ సెంటర్లో బుధవారం మానవహారం నిర్వహించారు. తొలుత తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి బాలాజీ చౌక్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ గత 12 రోజులుగా కార్మికులు అనేక విధాల ఆందోళనలు చేస్తున్న యాజమాన్యానికి కానీ ప్రభుత్వానికి కానీ చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఫ్యాక్టరీలు తీసుకువచ్చి ఉపాధి కల్పిస్తామని హామీలు ఇచ్చారన్నారు. ఫ్యాక్టరీ మూతపడి 409 మంది కార్మికుల రోడ్డున పడినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సంబంధిత పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి పరిశ్రమను తెరిపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే ప్రభుత్వమే ఆ పరిశ్రమను తీసుకుని నిర్వాహణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి వీరబాబు, కె. చక్రధర్, ఎం.చంటి, సిహెచ్.గోవింద్, ఎస్.జయలక్ష్మి, వై.శివలక్ష్మి, జె.భాగ్యలక్ష్మి, టి.దేవి, బి.అన్నపూర్ణ నాయకత్వం వహించారు.

బాలాజీచౌక్ వద్ద మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు

'యనమల'ను కలిసిన 'ముదునూరి'

ప్రజాశక్తి - తుని

వైసిపి నేత యనమల కృష్ణుడును ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. యనమల కష్ణుడుకు ఇటీవల కాలంలో చేతికి గాయం అయింది. ఈ నేపథ్యంలోనే బుధవారం తునిలో కృష్ణుడు నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కృష్ణుడు త్వరగా కోలుకోవాలని ముదునూరి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమంగా కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందన్నారు.

కృష్ణుడిని పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు

బాధిత కుటుంబానికి జడ్‌పిటిసి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఇటీవల అనారోగ్యంతో మరణించిన వ్యవసాయ కూలీ రెడ్డి గోవిందరాజులు కుటుంబ సభ్యులకు జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ బుధవారం నగదు సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఒక బియ్యం బస్తా, నిత్యావసర సరుకులతో పాటు రూ.4000 ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఉప్పంగల సర్పంచ్ శాఖ శంకరుడు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న సామ్యూల్ సాగర్

29న 'గొల్లప్రోలు' కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈ నెల 29వ తేదీన గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.రవికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగే సాధారణ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, నగర పంచాయతీకి చెందిన అన్ని విభాగాల అధికారులు సకాలంలో హాజరు కావాలని కమిషనర్ కోరారు.

3,4,5 తేదీల్లో క్లాప్స్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక లూథరన్ హైస్కూల్‌లో డిసెంబర్ 3, 4, 5 తేదీల్లో ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి క్లాప్స్ వార్షికోత్సవంతోపాటు, క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు క్లాప్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ లంక పురుషోత్తమదాస్, కన్వీనర్ డాక్టర్ సిబిఐ.సుకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్వర్ణ దేవాలయం వ్యవస్థాపకులు, బైబిల్ మిషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ జిఆర్.ఇమ్మానుయేల్‌రాజ్, సినీ డాన్స్ మాస్టర్ డాక్టర్ పి.జెకర్యా, డాక్టర్ ప్రసాద్‌పాల్ పాల్గొంటారని తెలిపారు.

మద్యం లూజు విక్రయాలు నిషేధించాలి

ప్రజాశక్తి - కాకినాడ

మద్యం దుకాణాల్లో లూజు విక్రయాలను నిలుపుదల చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఒకపక్క ప్రయివేటు మద్యం దుకాణాలు విచ్చలవిడిగా ఉన్నాయని, వీటికితోడు బెల్ట్‌షాపులు వందల సంఖ్యలో నిర్వహణ జరుగుతున్నాయన్నారు. మద్యం దుకాణాల నిర్వాహణ బార్లు మాదిరిగా ఉంటున్నాయని అన్నారు. విచ్చలవిడిగా మద్యం లభించడంతో యువత పెడదోవ పడుతున్నారని అన్నారు. మద్యం దుకాణాల్లో లూజు అమ్మకాలను నిషేధించడంతోపాటు, బెల్ట్ షాపులను పూర్తి స్థాయిలో బంద్ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చిన్నబ్రహ్మదేవం 11 కె.వి, ఇండస్ట్రియల్ 11 కె.వి ఫీడర్ పిఎంఐ పనుల కారణంగా ఈనెల 28వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఆర్‌బి.పట్నం సబ్ స్టేషన్ పరిధిలోని చిన్న బ్రహ్మదేవం, రాయభూపాలపట్నం, ఆర్.బి కొత్తూరు, మేడపాడు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, దీనిని విద్యుత్తు వినియోగదారులు గమనించాలన్నారు.

కార్టూ'నిజం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బుధవారం స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన అధ్యక్షతన జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సేవలు, మందులు పూర్తిస్థాయిలో అందే విధంగా కృషి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సౌకర్యాలు, సేవలు వంటి అంశాలపై డాక్టర్లు, అభివృద్ధి కమిటీ సభ్యులతో చర్చించారు. అలాగే ఆసుపత్రి అవసరాలు, సౌకర్యాల కల్పన వంటి అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. మాజీ జడ్‌పిటిసి గుమ్మళ్ల రామకృష్ణ ఆర్థిక సహకారంతో అందించిన గ్రాస్ కట్టర్‌ను ఆయన ఆసుపత్రికి అందజేశారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడ్డం పెదకాపు, కొరుపూరి రాజు, కొత్తెం బాబు, ఉల్లి సత్యనారాయణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వంగలపూడి సతీష్, సంజీవకుమార్, మేడిశెట్టి కుమారి పాల్గొన్నారు.

ఐడిఎల్ డిగ్రీ కళాశాలతో ఒడిగోస్ ఎంఒయు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని ఐడిఎల్ డిగ్రీ కాలేజీతో ఒడిగోస్ ఎంఒయు ఒప్పందం చేసుకుంది. బుధవారం ఐడిఎల్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐడిఎల్ డిగ్రీ కాలేజీ కంప్యూటర్ సైన్స్ హెచ్ఒడి జీవన్ కాంత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ, అకాడమిక్ డైరెక్టర్స్ రంజిత్, వాసు, వైస్ ప్రిన్సిపల్ కామరాజు, ఒడిగోస్ మేనేజింగ్ డైరెక్టర్స్ వార వినోద్, వార సత్యనారాయణ పాల్గొని ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఒడిగోస్‌తో ఎంఒయు చేసుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. ఒడిగోస్ మేనేజింగ్ డైరెక్టర్స్ వార వినోద్, వార సత్యనారాయణ మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక వ్యవస్థలో కంపెనీల యొక్క అవసరానికి తగ్గినట్టుగా విద్యార్థులను తయారు జేస్తున్న తమ సంస్థ అధికారికంగా ఐడిఎల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఫుల్ స్టాక్, యుఐ, యుక్సకోర్సెస్ మీద శిక్షణ ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఎంఒయు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఒడిగోస్ మీద ఉన్న నమ్మకంతో ఎంఒయు చేసుకున్న కళాశాల యాజమాన్యంకు వారు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు సరియైన పద్ధతిలో నేర్చుకుంటే కేవలం 4 నెలలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒడిగోస్ ఫౌండర్స్ మేరీ జ్యోతి, మేనేజర్స్ శిరీష, లారా, కో-ఆర్డినేటర్స్ మౌలిక, రామ, పద్మ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఒయు చేసుకున్న ఒడిగోస్ నిర్వాహకులను సివైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ మూర్తి రాజు ప్రత్యేకంగా అభినందించారు.

ఎంఒయు పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

నేరాలు ఘోరాలు

పాము కాటుతో రైతు మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతును పాము కాటు వేయడంతో మృతి చెందాడు. బుధవారం మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన పైన్ని వీర వెంకట సత్యనారాయణ (58) రోజు మాదిరిగానే పొలానికి వెళ్లి వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో అతనిని హుటాహుటిన సామర్లకోట ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అతను పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ సంఘటనపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

38 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎక్సైజ్ అధికారులు బుధవారం మండలంలో నిర్వహించిన దాడుల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి 38 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కె.కోటేశ్వర్ తెలిపారు. కరప మండలం పెద్దాపురపాడు గ్రామానికి చెందిన యాళ్ళ శంకర్, వాసంశెట్టి సత్యనారాయణ అనే వ్యక్తులతో పాటు మద్యం రవాణాకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ వై.నాగేంద్రకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గోవిందపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సా రా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జున్ రావు తెలిపారు. అలాగే సూరంపాలెం గ్రామంలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 2 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

కులంపేరుతో దూషించిన కేసుపై విచారణ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక యువతితో గొడవపడి కులం పేరుతో దూషించిన కేసులో బుధవారం కొత్తపేట డిఎస్‌పి వై.గోవిందరావు కేసుకు సంబంధించి పలువురిని విచారించారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామానికి చెందిన మద్దాల నిరీక్షణ ఆత్రేయపురం గ్రామం కాలువ రేవు సెంటర్లో ఉన్న స్వామి పూతరేకులు షాపులో పనిచేస్తోంది. ఈ నెల 5న నిరీక్షణ పనిచేయుచున్న సమయంలో పక్క షాపులో ఉన్న చింతా మారియ్య వచ్చి పూతరేకుల వ్యాపారం విషయంలో ఆమెతో గొడవ పెట్టుకుని కులం పేరుతో దూషించాడు. దీనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి డిఎస్‌పి వై.గోవిందరావు సంఘటన స్థలంలో మరియు స్థానిక స్టేషన్లో సాక్షులను పిలిచి పలు వివరాలను సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - కడియం

మండలంలోని వేమగిరి 216వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థిని మృతి చెందినట్టు ఎస్ఐ బి.నాగదుర్గా ప్రసాద్ తెలిపారు. వేమగిరి గట్టు ప్రాంతానికి చెందిన కల్లా దుర్గ ఆమె మేనకోడలు పితాని రూపాదేవి(18)తో కలిసి స్కూటీపై డిగ్రీ పరీక్షలు రాయించేందుకు వేమగిరితోట నుంచి రాజమహేంద్రవరం వెళ్తుండగా, వేమగిరి సెంటర్ వద్ద రాజమహేంద్రవరం వైపు తిరుగుతుండగా రావులపాలెం వైపు నుండి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ప్రైవేట్ కాలేజీ బస్సు స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీ అదుపుతప్పి కింద పడిపోవడంతో వెనక కూర్చున్న రూపాదేవి మీద నుండి బస్సు వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరినీ రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా రూపాదేవి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఎస్ఐ వెల్లడించారు.

'మాకు మా నాన్న కావాలి'

రెండు రోజులుగా పోరాడుతున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

'మాకు మా నాన్న కావాలంటూ పిల్లలు రెండురోజులుగా ఇంటి వద్దే దీక్షకు దిగారు. ఈ ఘటన చెందుర్తిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు చెందుర్తికి చెందిన బత్తిన అప్పారావు, లక్ష్మి భార్యాభర్తలు, వారికి కుమార్తెలు దుర్గ భవాని, స్వర్ణాంజలి, కుమారుడు శివన్నారాయణ ఉన్నారు. అప్పారావు సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో టెక్నికల్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేసి ఇటీవలే రిటైర్డ్ అయ్యాడు. ఉద్యోగంలో ఉండగానే రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అప్పటి నుంచి మతిస్థిమితం సరిగా లేదు. ఇదే అదునుగా కొంత మంది సహోద్యోగులు తన తండ్రికి చెడు వ్యసనాలు అలవాటు చేశారని, అప్పట నుంచి సరిగ్గా ఇంటికి రావడం లేదని వారు తెలిపారు. ఆరా తీయగా ఒక మహిళా ఉద్యోగితో వివాహేతర సంబంధం ఉన్నట్టుగా తెలిసిందన్నారు. దీనిపై తమ తండ్రి ఆరా తీయగా సమాధానం చెప్పట్లేదన్నారు. దీనిపై కలెక్టర్, ఎస్‌పిలకు ఫిర్యాదు చేశామన్నారు. ఫిర్యాదును గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌కు పంపారన్నారు. అయితే తమకు సరైన న్యాయం జరుగలేదని తెలిపారు. ఇటీవలే తమ తల్లికి బైపాస్ సర్జరీ చేయించామన్నారు. డబ్బులు కూడా లేక నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ తండ్రికి సంబంధించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం తమ తండ్రిని లొంగదీసుకున్నారని తెలిపారు. దీనిపై పిఠాపురం సిఐ మాట్లాడారు. ఇరువురుతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక సంత మార్కెట్‌లో మెప్మా ఆధ్వర్యంలో బుధవారం అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు, గ్రూపులు తయారు చేసిన పలు ఉత్పత్తులను అర్బన్ మార్కెట్లో విక్రయానికి ఉంచారు. మహిళలను ఆర్థికంగా ఆదుకునే దిశగా ఈ మార్కెట్ ను ఏర్పాటు చేసినట్లు మెప్మా సిఎంఎం హుస్సేన్ తెలిపారు. వస్త్రాలు, తినుబండారాలు, అల్లికల వస్తువులు, డ్రై ఫ్రూట్స్ తదితర స్టాల్స్ ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మెప్మా సిఇఒలు ప్రసాద్‌బాబు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొల్లప్రోలు-తాటిపర్తి పుంత రోడ్డు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

గుంతలతో ఉన్న గొల్లప్రోలు-తాటిపర్తి పుంత రోడ్డు

రూరల్ గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. గత ప్రభుత్వ పాలనలో రహదారుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు, ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలతో రహదారులన్నీ పెద్ద పెద్ద గుంతలుగా ఏర్పడ్డాయి. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు అధ్వానంగా ఉన్న రహదారులనే ప్రధాన ఎన్నికల ప్రచారం అంశంగా మార్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రహదారులకు మోక్షం కల్గుతుందని ప్రజలు భావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 6 నెలల కావస్తోంది. అయితే ఇటీవల కొన్ని వందల కోట్లను రహదారుల మరమ్మతుల కోసం విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే మండలంలోని రూరల్ ప్రాంతాల పరిధిలో ఉన్న రహదారులకు నేటికీ మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గొల్లప్రోలు- తాటిపర్తి పుంత రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. ఈ పుంత రోడ్డు తాటిపర్తి, చిన్న జగ్గంపేట, వన్నెపూడి, కొడవలి తదితర గ్రామాలకు ప్రధానమైంది. ఆయా గ్రామాల ప్రజలు గొల్లప్రోలు రావాలంటే ఇదే ప్రధానమైన రహదారి. నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఆ రహదారిపైనే రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో ప్రజలు ఈ రహదారిలో ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందే. గుంతల్లో పడి అనేక మంది గాయాలపాలు అవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గొల్లప్రోలు- తాటిపర్తి పుంత రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పెద్దాపురం, ఏలేశ్వరం, కాజులూరు

పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామ పరిధిలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే వరి కోతలను రైతులు వాయిదా వేసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను తట్టుకునే వరి వంగడాలు, వరి పంటను ఆశించే పురుగులు, వాటి నివారణ పద్ధతులపై రైతులకు ఎడిఎ నల్లి దైవకుమార్ అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ పొలంబడి ద్వారా రైతులు అవగాహన పొందటం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా పొలం బడి రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునే వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ ఎన్‌వివి.ప్రసాద్, స్రవంతి, పి.నాగేశ్వరరావు, కొరకుల పాపారావు, గరగ విజయ్, సుందరపల్లి వసంతరావు, ఎన్.గోవిందు, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు. అలాగే ఏలేశ్వరం మండలంలోని లింగంపర్తి, బద్రవరం, పేరవరం గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న మూడు రోజుల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు కోసిన ధాన్యాన్ని దగ్గర్లోని మిల్లులకు చేర్చాలని సూచించారు. అవకాశం లేనిపక్షంలో సురక్షిత ప్రాంతంలో బరకాలు కప్పి సంరక్షించాలన్నారు. వరి కోతలు కొన్ని రోజులు వాయిదా వేసుకోమని సూచించారు. పంట పొలాల్లో అధికంగా నీరు నిలబడితే వెంటనే బయటకు పోయేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది పంట పొలాలను సందర్శించి రైతులకు భారీ వర్షాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలని ఆదేశించారు. కాజులూరు మండలంలోని పలు గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి అశోక్‌తో తహశీల్దార్ ఎల్.శివకుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావంతో పంటలు నాశనం కాకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గురువారం నుంచి తుపాను ప్రభావం ఉండే అవకాశం ఉందని, కావున రైతులు పంట కోతలను 4 రోజులపాటు వాయిదా వేసుకోవాలని సూచించారు. కళ్ళాల్లో ఉన్న ధాన్యాన్ని బరకాలతో పూర్తిస్థాయిలో కప్పాలని అన్నారు. చేలల్లో ఉన్న ధాన్యాన్ని మెరక ప్రదేశంలో భద్రపరచుకోవాలని కోరారు. రైతు సేవ కేంద్రాల ద్వారా ఎగుమతి అవుతున్న ధాన్యాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస వర్మ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఎఒ

పెద్దాపురంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జెడి

కాజులూరులో రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్

అత్యవసర సేవలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సునీత

ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులంతా ప్రజలకు అవసరమైన అత్యవసర సేవలపై దృష్టి సారించాలని ఎంపిపి రాయుడు సునీత అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న అత్యవసర పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కె.సత్య నారాయణ, జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, వైస్ ఎంపిపిలు కొపనాతి లలిత, దూలిపుడి నాగేంద్రప్రసాద్, ఎంపిటిసి సభ్యులు నందికొల్ల శ్రీదేవి, కిరణ్‌కుమారి, చిట్టూరి లలితపద్మ, గుత్తుల శ్రీనివాస్, యర్రంనీడి అప్పారావు, గర్రె సాయిలక్ష్మి, దంగేటి సూరిబాబు, బల్ల సంధ్యారాణి, రచ్చ ముత్యాలు, ఎఒ ప్రశాంతి, ఇరిగేషన్ ఎఇ అనూష, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జెఎన్‌టియుకెలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

రక్తదాతతో ఎన్‌సిసి అధికారులు

ఎన్‌సిసి 18వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి దినోత్సవం సందర్భంగా జెఎన్‌టియుకెలో రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు కళాశాలలకు చెందిన ఎన్‌సిసి క్యాండెట్స్, జెఎన్‌టియుకె విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులకు రామారావు పేట హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మేనేజర్ చంద్రబాబు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ కె.మొహమ్మద్ ఆసిఫ్ మేజర్ హేమంత్‌కుమార్, సుబేదార్ గురేందర్‌సింగ్, సుబేదార్ డి.గణేషన్, హవల్దర్ రఫిక్ జానీ, హవలదర్ సునీల్ కుమార్, జి గోపాల్, హవల్దార్ సురేష బాబు, హవల్దార్ బికాస్ గురున పాల్గొన్నారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

సామర్లకోట మండలం పనసపాడులో సభ్యత నమోదులో నాయకులు

మండలంలోని పనసపాడులో గ్రామ సర్పంచ్ చీకట్ల వెంకటేష్ నేతృత్వంలో టిడిపి సభ్యత్వ నమోదు జోరుగా సాగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం తీసుకునేందుకు ప్రజలు పెద్దఎత్తున ముందుకు వస్తున్నారని అన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా సభ్యత్వాన్ని పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జ్ అనుసూరి రాంబాబు, బూత్ కమిటీ కన్వీనర్‌లు అమలాపురం దుర్గాప్రసాద్, పెంకె శ్రీను, అనుసూరి సుబ్రహ్మణ్యం, ఐటిడిపి ఇన్‌ఛార్జ్ రేలంగి వెంకట్రావు, నాయకులు టిల్లపూడి త్రిమూర్తులు, తాటినాటి రాఘవేంద్రరావు, వెలుగు ఏసుబాబు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మండలంలోని జి.రాగంపేట గ్రామంలో బుధవారం టిడిపి సభ్యత్వ నమోదు ముమ్మురంగా జరిగిందని టిడిపి గ్రామ అధ్యక్షులు జలధాని సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఇప్పటివరకు 200 సభ్యత్వ నమోదు పూర్తి చేశామన్నారు. సభ్యత్వం నమోదు చేసుకున్న వారందరూ టిడిపి కుటుంబ సభ్యులుగా ఉంటారని, సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల వరకూ ఇన్సూరెన్స్ ఉంటుందన్నారు.

బాల్య వివాహాలకు సహకరించిన వారికీ శిక్ష

ప్రజాశక్తి - సామర్లకోట

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీవిద్య

సమాజంలో బాల్యవివాహాలకు సహకరించే తల్లిదండ్రులతోపాటు, అందుకు సహకరించే వారికి శిక్ష తప్పదని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. బుధవారం స్థానిక మెప్మా కార్యాలయంలో సిఎంఎం సయ్యద్ హుస్సేన్ అధ్యక్షతన బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల పిల్లలకు అనారోగ్యం కలగడమే కాకుండా పుట్టే బిడ్డలు రక్తహీనతతో జన్మిస్తారని అన్నారు. ప్రతి మండల సమాఖ్య సమావేశంలో బాల్యవివాహాలు నిరోధంపై ప్రత్యేక అజెండా అంశంగా పెట్టి చర్చించాలని సూచించారు. అలాగే స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, ప్రముఖ న్యాయవాది కొర్లమండ శ్రీవాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం వి.రాజు, మానవ హక్కుల సంఘం జిల్లా నాయకులు ఎస్.రెహమాన్, జుత్తుగ అప్పారావు, ఎండి భాషా, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిఒలు, రిసోర్‌పర్సన్లు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో విచారణ చేపడతాం

ప్రజాశక్తి - పెదపూడి

వెలుగు ఇన్‌ఛార్జ్ ఎపిఎం చినబాబుపై వచ్చిన ఆరోపణలపై 3 రోజుల్లో విచారణ చేపడతామని డిపిఎం వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో యానిమేటర్లకు స్త్రీనిధి, సిఐఎఫ్, ఉన్నతి మొదలగు పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరోపణలుపై విచారణ చేపట్టి ఆ నివేదికలు ఉన్నత అధికారులకు అందజేస్తామన్నారు. కార్యాలయానికి సంబంధించి రికార్డులు అన్ని ఎప్పటికప్పుడు సక్రమంగా అమలు చేయాలని డ్వాక్రా సంఘాల యానిమేటర్లను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ అధికారి భవానీ, ఇన్‌ఛార్జ్ ఎపిఎం చినబాబు, శ్రీను పాల్గొన్నారు.

పెద్దాపురంలో కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం

కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మహిళలు

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఐసిడిఎస్ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ జరిగిన ఈ ర్యాలీలో ఎంపిడిఒ శ్రీలలిత, సిడిపిఒ జి.ఉష, మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాల అనర్థాలపై విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. మారుమూల గ్రామంలో కూడా బాల్యవివాహాలు జరగకుండా నిరోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉమాదేవి, వీరలక్ష్మి, సుల్తాన్ బీబీ, చంద్రకళ, మంగ, నిర్మల కుమారి, వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ర్యాలీలో నినాదాలు చేస్తున్న మహిళలు

సంఘటితంగా హింసను ఎదుర్కోవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మహిళలపై జరుగుతున్న హింసను సంఘటితంగా ఎదుర్కోవాలని భీమాబాయి మహిళా మండలి ప్రతినిధి వాసంశెట్టి నందివర్ధన అన్నారు. మహిళా మండలి ఆధ్వర్యంలో బుధవారం తాళ్లరేవులో లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా 16 రోజులపాటు నిర్వహించే అంతర్జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలు ఎదుర్కొంటున్న పలు హింసలను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యలు, సంప్రదించాల్సిన ప్రభుత్వ శాఖల గురించి వివరించారు. చవలసిన ప్రభుత్వ శాఖలను గురించి వివరించారు. బాలికల చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని బాలికలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్ళరేవు, ఐ.పోలవరం మండలాలకు చెందిన పలువురు మహిళలు, భీమాబాయి మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.

యానాం వార్తలు

బంగారు పతకం సాధించిన కర్రి జశ్వీర్

బంగారు పతకం సాధించిన శ్రీవేద విద్యార్థి

ప్రజాశక్తి - యానాం

ఆంధ్రప్రదేశ్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో శ్రీ వేద పబ్లిక్ స్కూల్ విద్యార్థి కర్రి జశ్వీర్ బంగారు పతకాన్ని సాధించాడని ఛైర్మన్ గుత్తుల గోవిందజయ రామారావు, డైరెక్టర్స్ నీతూ, అర్జున్ బుధవారం తెలిపారు. ఈ నెల 25న రామచంద్రపురంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో నాలుగో తరగతి విద్యార్థి కర్రి జశ్వీర్ విశేష ప్రతిభను కనబరిచాడన్నారు. అలాగే యానాంలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మిడిల్ విభాగంలో మొదటి బహుమతిని శ్రీవేద స్కూల్ విద్యార్థి కాళ్ళ భానుతేజ గెలుచుకున్నాడన్నారు. వీరిద్దరిని పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, విద్యాశాఖాధికారి పి.లక్ష్మణప్రవీణ్, ఎడిపిసి కమిడి ప్రభాకరరావు, శ్రీ వేద స్కూల్ ఛైర్మన్ గుత్తుల గోవింద జయ రామారావు, డైరెక్టర్స్ నీతూ, అర్జున్ అభినందించారు.

యాంటీ బయోటిక్స్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - యానాం

యానాం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో యాంటీ బయోటిక్స్ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు మాట్లాడుతూ యాంటీబయోటిక్స్‌ను సొంతంగా వినియోగించకూడదన్నారు ఒకరికి రాసిన యాంటీబయోటిక్స్ మందులను వేరొకరికి వినియోగించకూడదని, ఎక్కువగా వినియోగించడం వల్లఉత్పన్నమయ్యే సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య శాఖ అధికారి డాక్టర్ టి.రవిశంకర్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాస్

ప్రజాశక్తి - యానాం

యానాం సబ్ రిజిస్ట్రార్‌గా డిప్యుటేషన్‌పై రెయ్యా శ్రీనివాస్‌ను నియమిస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి వి.జయశంకర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన స్థానిక ఉమెన్ అండ్ ఛైల్డ్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈయన ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం డిప్యుటేషన్‌పై వచ్చి సబ్ రిజిస్ట్రార్ సేవలందిస్తున్న నరేంద్రకుమార్‌ను తిరిగి ఆయన సొంతశాఖకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

అడ్డతీగల సిడిపిఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

మినివర్కర్‌కి పదోన్నతి కల్పించకుండా అన్యాయంగా వ్యవహరిస్తున్న అడ్డతీగల సిడిపిఒపై చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మావతి, ఎలుగుబంటి చంద్రావతి బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అడ్డతీగల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని తిమ్మాపురం సెంటర్ వర్కర్ మృతి చెందడంతో ఆ పోస్టు ఖాళీ అయిందన్నారు. ఆదే పంచాయతీ పరిధిలో డి.కిష్టవరం సెంటర్ మినీ వర్కర్‌కు 12 సంవత్సరాల సర్వీసు కల్గివుందన్నారు. జిఒ ప్రకారం మినీ వర్కర్‌కి అక్కడ పదోన్నతి ఇచ్చే అవకావం ఉన్నా సిడిపిఒ ఆమెకు పదోన్నతి ఇచ్చేది లేదని, అటువంటి జిఒలు ఎన్నో తెస్తాను అంటూ మినీ వర్కర్ పట్ల అవహేళనగా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. తక్షణమే ఆ మినివర్కర్‌కి పదోన్నతి ఇవ్వాలని, లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా సిడిపిఒ తన వైఖరిని మార్చుకోవాలని సూచించారు. అవసరం లేకపోయినా అంగన్‌వాడీ కార్యకర్తలను కార్యాలయానికి రప్పించుకోవడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

354 అర్జీలకు పరిష్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

మండల పరిధిలో ఇప్పటి వరకూ నిర్వహించిన 17 రీ సర్వే గ్రామ సభల్లో 354 అర్జీలను ఆయా గ్రామాల్లో పరిష్కరించినట్లు తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 17 గ్రామ సభల్లో మొత్తం 640 ఫిర్యాదులు రాగా వాటిలో 354 దరఖాస్తులు పరిష్కరించడం జరిగిందన్నారు. మిగిలిన దరఖాస్తులు డిసెంబర్ 20వ తేదీలోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మ్యూటేషన్‌కు సంబంధించి 50 స్థలాలకు, 55 సర్వే నెంబర్ల దిద్దుబాటు, 43 జాయింట్ ఎల్‌పిఎంలు, భూమి విస్తీర్ణంలో తేడాలు 356, వర్గీకరణలో తేడాలు 18, మొబైల్ నెంబర్ ఫీడింగ్ 26, ఆధార్ సీడింగ్ 20, ఎఫ్ లైన్ పిటిషన్ మూడు వెరసి 640 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ఎడ్ల శ్రీనివాస్, మండల డిప్యూటీ తహశీల్దార్ పద్మజ పాల్గొన్నారు.

85 శాతం అపార్ నమోదు పూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో అపార్ 85 శాతం పూర్తయిందని ఎంపిడిఒ శ్రీలలిత అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఇఒ విఆర్‌కె.చౌదరి అధ్యక్షతన వివిధ పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకూ 85 శాతం అపార్ నమోదు పూర్తికాగా, మిగిలిన 15 శాతం త్వరితగతిని పూర్తి చేయాలన్నారు. ఎంఇఒ చౌదరి మాట్లాడుతూ డిసెంబర్ 7వ తేదీన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగు మండల పరిధిలోని 79 పాఠశాలల్లో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్ఎ-1, ఎఫ్ ఎ-2 ల ప్రోగ్రెసివ్ రిపోర్టులు చదివి వినిపిస్తారన్నారు. ఈ కార్యక్రమాలన్నీ విజయవంతంగా నిర్వహించేందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలన్నారు.

In the Court of the VIIth Additional Junior Civil Judge at Kakinada
O.S. No. 385/2022

Between:
Kovvuri Subba Reddy ...*Plaintiff*
AND
Sathi Srinivas Sudheer Reddy and Another ...*Defendants*

To:
D-1: Sathi Srinivas Sudheer Reddy, S/o. Lakshmana Reddy, Occ: Special Deputy Tahsildar, O/o. Office the Godavari Urban Development Authority (GUDA), NFCL Road, Kakinada. R/o. D.No. 68-10-14/1, Saraswathi Marg, Near Ideal College, Vidyuth Nagar, Kakinada, Kakinada District.

D-2: Sathi Naga Lakshmi, W/o. Srinivas Sudheer Reddy, R/o. D.No. 68-10-14/1, Saraswathi Marg, Near Ideal College, Vidyuth Nagar, Kakinada, Kakinada District.

పై నెంబరు దావాలో 1వ మరియు 2వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 06-12-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

CH.KANAKA CHARI, Advocate
D.No. 3-164, Gaigolupadu,
Kakinada, Cell: 9948599037

CHANGE OF NAME

I, DINTAKURTHY NARAYANA, S/o. CHINA THIMMAYYA, D.No. 9-1-14, Water Works Veedhi, Vinayaka Temple, Rajahmundry, Rajahmundry Urban, E.G.District, A.P. I have changed my name from **DENTAKURTHI NARAYANA RAO** (Old Name) to **DINTAKURTHY NARAYANA** (New Name). Hence forth Iam being called **DINTAKURTHY NARAYANA,** S/o. China Thimmayya, for all purpose.

మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, కాకినాడ
M.V.O.P. 4/2023

Between:
తోలెం కన్నయమ్మ & వగైరా -పిటిషనర్స్
AND
యడ్ల నాగ సత్తిబాబు & వగైరా -రెస్పాండెంట్స్

R-2: మాకిరెడ్డి అప్పలనాయుడు, S/o. కన్నబాబు, C/o. యడ్ల నాగ సత్తిబాబు, పాత కొట్టాం గ్రామం, కోటనందూరు (మండలం), కాకినాడ జిల్లా.
ట్రాక్టర్ యజమాని, బేరింగ్ నం. AP 31 CR 3683
ట్రాయిలర్ యజమాని,బేరింగ్ నెం. AP 31 TM 0775

R-4: తాలై దుర్గాదేవి, D/o. గురువులు, వయస్సు 32 సం॥లు, డో.నెం. 58-11-13, సంజీవనగర్, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా.

పై నంబరు పిటీషనులో 2వ రెస్పాండెంట్ మరియు 4వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపినప్పటికి తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు సమన్లు అమలు నిమిత్తం **ది. 13-12-2024వ తేదీన వాయిదా అయి ఉన్నది. ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(By Court Order)
K.V.BHADRA RAO
K.SRIVANI
K.S.CHANDRA RAO
Advocates, Kakinada
Cell: 94401 77063

డిశ్చార్జ్ బుక్ పడిపోయినది

సెవల జయరావు అను నేను ఈ నెల అనగా ది. 21-11-2024వ తేదీన ఆటోలో ప్రయాణిస్తూ అల్లవరం నందు 6891556 సర్వీసు నెంబరు గల నా యొక్క డిశ్చార్జ్ బుక్ పోగొట్టుకొనుట జరిగింది. అది ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

S.JAYARAO (Ex- Army),
D-NO-3-57, THUMMALAPALLI (Post),
BENDAMURLANKA,
Dr. B.R.AMBEDKAR KONASEEMA
DISTRICT, PIN-533 210.
Cell : 9866164374